చవితి సందడి



● వాడవాడలా గణపయ్యకు ప్రత్యేక పూజలు

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపరమేశ్వరుల జ్యేష్ఠపుత్రుడు, ఆదిదేవుడు వినాయకుడు వాడవాడలా పూజలందుకుంటున్నారు. వీధివీధినా ఏర్పాటు చేసిన మండపాలలో అందంగా ముచ్చటగా రూపొందించిన గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి, బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. విఘ్నాలు తొలగి, శుభాలు కలుగాలన్న కోరికతో ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో లంబోదరుడికి సంప్రదాయ పూజలు ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ప్రతి ఇల్లు, మండపాలు వినాయకచవితి సందర్భంగా రంగురంగుల విద్యుద్దీపాలతో తోరణాలతో శోభాయమానంగా ధగధగలాడుతున్నాయి. అరటి, మామిడి, కొబ్బరి, జిల్లేడు పూలతో ప్రత్యేక అలంకరణలతో వేదికలు కళకళలాడుతున్నాయి. పిల్లలు, పెద్దల సందడితో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. గణేశ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ యేడాది కూడా పోటీతత్వంతో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు రోజుల నుండి ఐదు రోజుల వరకు పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు. సంగీత భరత నాట్య కళాకారుల ప్రదర్శనలతో వేదిక ప్రాంతాలు హోరెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో చతుర్థి వేడుకలకు ప్రసిద్ధి చెంది, దక్షిణ కైలాసంగా పిలువబడుతున్న తిరుచ్చి మలైకోట తాయుమానవన్‌స్వామివారి ఆలయంలో ఉచ్చి పిళ్లయార్ సన్నిధిలో తెల్లవారుజామునే ఆలయ ఏనుగు లక్ష్మికి గజపూజలు నిర్వహించారు. అనంతరం ఉచ్చి పిళ్లయార్, మాణిక్య వినాయక స్వాములను చందనంతో అలంకరించి, 150 కిలోల బరువుతో తయారు చేసిన భారీ కుడుమును నైవేద్యంగా నిర్వహించారు. అదే విధంగా శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపంలో ఉన్న పిళ్ళయార్‌పట్టి కర్పగ వినాయక ఆలయంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన తీర్థవారీలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో కొలువుదీరిన మూలవిరాట్టుకు భారీ సైజులో తయారు చేసిన కుడుమును నైవేద్యంగా సమర్పించారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఉన్న ముక్కురిణి వినాయకుడికి కూడా రకరకాల నైవేద్యాలు నివేదించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా తంజావూరు జిల్లా స్వామిమలైలో సమీపంలోని సాక్షినాథస్వామి ఆలయంలో వరుణ భగవానుడు ప్రతిష్ఠించిన వినాయకుడికి చతుర్థిని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుండి తేనెతో అభిషేకాలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము వరకు సాగిన ఈ అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ అభిషేకించిన తేనెను ప్రసాదంగా పంపిణీ చేశారు.



మైలాపూర్‌లో అల్లికేని రాజాదర్బార్ వినాయకుడు



శివపార్వతుల గెటప్‌లో గణనాథుడు - సుబ్రహ్మణ్యస్వామి అలంకరణలో గణేష్ ప్రతిమ

నల్లకన్నుకు కృత్రిమ శ్వాసపరికరాలతో చికిత్స



నల్లకన్నును పరామర్శిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై,ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ నల్లకన్ను ఆరోగ్యం రోజురోజుకు విషమిస్తోంది.రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్)లోని అత్యవసర చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న ఆయనకు వైద్యులు కృత్రిమ శ్వాసపరికరాన్ని అమర్చారు. వృద్ధాప్య సమస్యలతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నల్లకన్ను కొద్ది రోజుల క్రితం తన నివాసంలో స్పృహ తప్పి పడిపోయారు. ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబీకులు క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం నాలుగు రోజుల క్రితం జీహెచ్‌కు తరలించిన విషయం తెలిసిందే. వైద్యనిపుణులు ఆయనకు అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. బుధవారం రాత్రి నల్లకన్నుకు ఉన్నట్టుండి శ్వాసకోశ సమస్యలు ఏర్పడటంతో వెంటనే ఆయనకు కృత్రిమ శ్వాసపరికరాలు అమర్చారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆసుపత్రికి వెళ్లి నల్లకన్నును పరామర్శించారు. ఆయనకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యుల వద్ద అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. నల్లకన్నుకు మూడు రోజుల ముందు ఆరోగ్యం బాగా కుదుటపడిందని, బుధవారం రాత్రి మళ్లీ శ్వాసకోశ సమస్యలు అధికం కావటంతో కృత్రిమ శ్వాస పరికరాలు అమర్చి చికిత్సలందిస్తున్నారని తెలిపారు. నల్లకన్నును పరామర్శించేందుకు ఎవరూ ఆసుపత్రికి రావద్దని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా జీహెచ్‌లో చికిత్సలందుకుంటున్న కమ్యూనిస్టు దిగ్గజం నల్లకన్ను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ గురువారం మధ్యాహ్నం తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పొందుపరిచారు.



మృతిచెందిన రాజేష్‌కుమార్ కుటుంబ సభ్యులు

ఛత్తీస్‌గఢ్‌లో వరదకు ఇంజనీరు కుటుంబం బలి

వేలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సంభవించిన వరద విపత్తులో తిరుపత్తూర్ జిల్లాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. పారండపల్లి గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ (45) 15 ఏళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కార్యాలయం రాయపూర్ జిల్లా జగత్‌పూర్‌లో ఉండగా, సమీపంలోనే భార్య పవిత్ర (38), కుమార్తెలు సత్య (8), సామిక (6)లతో కలసి నివసిస్తున్నారు. ఇటీవల తిరుపతి ఆలయంలో జరిగిన బంధువుల శుభకార్యక్రమంలో పాల్గొన్న రాజేష్ కుమార్ కుటుంబం కారులో ఛత్తీస్‌గఢ్‌కు బయలుదేరింది. వాహనం బుధవారం రాయపూర్ సమీపంలోని పండర్‌ఛందన మీదుగా వెళ్తుండగా హఠాత్తుగా వచ్చిపడిన వరద ప్రవాహంలో చిక్కుకుని కొట్టుకుపోయింది. ఈ ఘటనలో కారులో చిక్కుకున్న నలుగురు ఊపిరాడక మృతిచెందారు. రుక్‌మా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు నుంచి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం నలుగురి మృతదేహాలు స్వగ్రామానికి పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈపీఎస్‌కు 'సీపీఆర్'కే ఫోన్

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరుపున పోటీ చేస్తున్న సీపీ రాధాకృష్ణన్ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి ఫోన్ చేసి, మంతనాలు జరిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే నెల 9వ తేదీన జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తలపడుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ తమ గెలుపుకోసం కూటమి పార్టీ ఎంపీల మద్దతు సేకరిస్తున్నారు. గత వారం నగరానికి విచ్చేసిన సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన డీఎంకే మిత్ర పక్షాల ఎంపీలతో సమావేశమై మద్దతు సేకరించారు. అదేవిధంగా సీపీ రాధాకృష్ణన్ కూడా అన్నాడీఎంకే కూటమి ఎంపీలను సంప్రదించి మద్దతు కోరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో, ఢిల్లీలో ఉన్న సీపీ రాధాకృష్ణన్ ఈపీఎస్‌ను ఫోన్‌లో సంప్రదించి మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తారని ముందుగానే శుభాకాంక్షలు తెలియజేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈపీఎస్ తెలిపారు.



అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ఇదిలా వుండగా, స్థానిక అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఈపీఎస్ నివాసానికి ఫోన్ చేసిన ఓ అజ్ఞాత వ్యక్తి ఇంట్లో బాంబు ఉందని బెదిరించి కాల్ కట్‌చేశాడు. ఈ బెదిరింపుతో ఈపీఎస్ నివాసానికి పోలీసు జాగిలాలతో వెళ్లిన బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి బాంబు లేదని నిర్ధారించారు. ఈ వదంతులు పుట్టించిన వ్యక్తి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

రేపు అన్నాడీఎంకే కార్యదర్శులతో ఈపీఎస్ సమావేశం...

స్థానిక రాయపేట లాయడ్స్ రోడ్డులో ఉన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో వచ్చే శనివారం అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శులతో ఈపీఎస్ సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో 2026లో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ తరుపున చేపట్టాల్సిన కార్యక్రమాలు, బూత్ కమిటీల ఏర్పాటు, ఓట్ల అభ్యర్థన తదితర కీలకాంశాలపై ఈపీఎస్ పార్టీ కార్యదర్శులకు పలు సూచనలిచ్చే అవకాశముంది. ఈ సమావేశం అనంతరం ఈపీఎస్ తన మూడో విడత ప్రచారయాత్రను సెప్టెంబర్ 1వ తేదీన మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రారంభిస్తారు. ఈ పర్యటన సెప్టెంబర్ 13వ తేదీన కోవై జిల్లాలో ముగియనుందని పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



ఆవడి వద్ద బోల్తాపడిన కారు - (ఇన్‌సెట్‌లో) కముది వద్ద మృతి చెందిన దంపతులు

రక్తమోడిన రహదారులు

● రెండు చోట్ల దంపతుల దుర్మరణం

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రామనాదపురంలో, స్థానిక ఆవడి ప్రాంతంలో సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వివరాలిలా వున్నాయి... తిరువేర్కాడు ప్రాంతానికి చెందిన అరివళగన్ (41), శరణ్యా (36) అనే దంపతులు నివసిస్తున్నారు. గురువారం ఉదయం ఇరువురూ మోటారుబైకుపై ఆవడికి బయలుదేరారు. పరుత్తిపట్టు వసంతనగర్ ప్రాంతం వద్ద వెళుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ఇరువురినీ ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఇరువురూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మోటారు బైకు, కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు గమనించి కారు శిథిలాల మధ్య చిక్కుకున్న వ్యక్తిని వెలికి తీశారు. ఆవడి ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని జరిపిన విచారణలో కారు నడిపిన వ్యక్తి ఆవడి ప్రాంతానికి చెందిన డాక్టర్ ప్యారీమార్క్స్ అని తెలుసుకున్నారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కముది వద్ద మరో జంట మృతి

రామనాదపురం జిల్లా కముది వద్ద గురువారం వేకువజాము విద్యుత్ స్తంభాన్ని బైకు ఢీకొని దంపతులు దుర్మరణం చెందారు. కముది సమీపం అబిరామం ప్రాంతంలో నివసిస్తున్న కార్తీక్ అలియాస్ కాళిరాజా, మహారాణి అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి మూడు మాసాలకు ముందే వివాహం జరిగింది. కాళిరాజా కోయంబత్తూరులోని ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అబిరామం ప్రాంతంలో బుధవారం జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొనేందుకుగాను ఇరువురూ బైకులో కోయంబత్తూరు నుండి బయలుదేరారు. గురువారం వేకువజామున ఆ బైకు కముది ప్రాంతంలో వెళుతుండగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని కూడా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కాళిరాజా తీవ్రంగా గాయపడి ఆ స్థలంలోనే మృతి చెందారు. తలకు బలమైన గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మహారాణిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక ఆమె మృతి చెందారు. అబిరామం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సాహితీ సౌజన్యమూర్తి భువనచంద్ర

మద్రాసు వర్శిటీ తెలుగు శాఖ సదస్సులో వక్తలు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సరస్వతీకటాక్షం మెండుగా కలిగిన సాహితీ సౌజన్యమూర్తి ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర అని, సినిమా పాటల రచయితగానే తెలుగు ప్రేక్షక జనానికి పరిచయమైనా కథానికలు, నవలలు, కవితలు, సీరియల్స్ రచించిన తెలుగు సాహితీ మూర్తిగానూ పేరుగడించారని, ఆయన కలం నుంచి జాలువారిన 'వాళ్లు' సినారె 'విశ్వంభర'కు పోటీపడేలా ఉందని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వక్తలు కొనియాడారు. స్థానిక మెరీనా ప్రాంగణంలో 'భువన చంద్ర సాహితీ సాగరం - సృజనాత్మక హరివిల్లు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ఉదయం ప్రారంభం కాగా, తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఎస్పీ వసంతలక్ష్మి తెలుగుతల్లి ప్రార్థనతో ప్రారంభమైన ఈ సభలో డా. పాండురంగం కాళియప్ప స్వాగతోపన్యాసం చేశారు. సదస్సు ప్రత్యేక సంచికను ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ సంగీత దర్శకులు విద్యాసాగర్ ఆవిష్కరించగా, తొలి ప్రతిని విశిష్ట అతిథి ప్రముఖ సినీనటి ప్రభారమేష్ స్వీకరించారు. విస్తాలి శంకరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ సినీ గేయరచయిత అనే ముసుగు వెనుక దాగిన భువనచంద్ర సాహిత్యాన్ని సర్వమానవాళికి సమగ్రంగా పరిచయం చేయడమే అంతర్జాతీయ సదస్సు ప్రధానోద్దేశమని అన్నారు. గౌరవ అతిథి సినీ గేయరచయిత డా. వనమాలి ప్రసంగిస్తూ తన మొదటి కవిత పురుడుపోసుకున్నది తెలుగుశాఖ సభలోనేనని చెప్పారు. పాత్రికేయుడిగా ఉన్నప్పుడు భువనచంద్రను ఇంటర్వ్యూ చేశానని, ఆయనెప్పుడూ అవార్డుల కోసం వెంపర్లాడలేదన్నారు. సినీ సంగీత దర్శకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. తెలుగు సినీనిర్మాత తమ్మారెడ్డి వరుసగా తీసిన సినిమాలకు భువనచంద్రతో తాను కలిసి పనిచేశానని చెప్పారు. భువన చంద్ర గొప్ప గాయకుడని, లోకపరిజ్ఞానం కలిగిన ఆధ్యాత్మికవేత్త అని ప్రశంసించారు. నటి ప్రభారమేష్ మాట్లాడుతూ.. సినిమాలలో పాట వచ్చిన తర్వాతే తమ ఆట మొదలవుతుందని, మంచి పదాలతో సినిమా పాటలు రాసిన భువనచంద్ర సినీ గేయరచయితగానే కాకుండా సాహిత్యవేత్తగాను రెండు రంగాల్లో పేరు సంపాదించుకోవడం సంతోషదాయకమని అన్నారు. వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు భువనచంద్ర ప్రకృతిమాత విశేషాలపై రచించిన కవితను జేకే రెడ్డి పద్యంలా చదివి శ్రోతలను అలరించారు.పొట్టి శ్రీరాములు భవన నిర్వాహక కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ మాట్లాడుతూ.. భువనచంద్ర పాటలు, కవితలు చంద్రుడిలా చల్లగా మనస్సుకు ఆహ్లాదకరంగా ఉంటాయని ప్రశంసించారు. ఆత్మీయ అతిథి శ్రీదేవి శ్రీకాంత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సందేశం వినిపించారు. విశ్వర్షి డా. వాసిలి వసంతకుమార్ కీలకోపన్యాసం చేస్తూ.. భువనచంద్ర రచించిన 'వాళ్లు', 'పాదచారి' వింత అనుభూతులను కలిగిస్తాయని అన్నారు. తానింకా రాయని తన జీవిత చరిత్రను భువనచంద్రకు అంకితమివ్వనున్నట్లు ఆయన ప్రకటించారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

టైప్‌రైటర్‌ని మాత్రమే: భువనచంద్ర

కవికి సంకల్పం బలమైనదైతే సరస్వతీ కటాక్షంతో మనస్సులో కలిగిన ఆలోచనలు కవితల రూపంలో పొంగి పొర్లుతాయని భువనచంద్ర అన్నారు. కవులకు, రచయితలకు తమ రచనలపై ఇతరులు ప్రశంసలు, విమర్శలు చేసేటప్పుడే ఆనందం కలుగుతుందని చెప్పారు. సినిమా పాటలు, నవలలు, కథలు, కవితలు తానే రాశానని చెప్పడం భావ్యం కాదని, మదిలోని తలంపులకు అక్షరరూపం కల్పించిన టైప్ రైటర్‌ని మాత్రమేనని వినమ్రంగా పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్‌కుమార్‌రెడ్డి విద్యాసాగర్ గురించి ప్రస్తావిస్తూ విద్యాసాగర్ సంగీతసారథ్యంలో రూపొందించిన 'బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవం' ఆల్బమ్‌ను తిరుపతి తిరుమల దేవస్థానంవారు ఇప్పటికీ తమ కార్యక్రమాల సందర్భంగా వినిపిస్తున్నారని గుర్తు చేశారు. ప్రారంభ సమావేశంలో పాల్గొన్న అతిథులందరినీ ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్ శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు. భువనచంద్రకు తెలుగుశాఖ తరపున నూతన వస్త్రాలను కానుకలుగా సమర్పించి ఘనంగా సత్కరించారు. చివరిగా విస్తాలి యూట్యూబ్ ఛానెల్‌ను భువనచంద్ర ప్రారంభించారు. డా. మాదా శంకరబాబు వందన సమర్పణతో ప్రారంభ సమావేశం ముగిసింది.

అమీబాపై ఆందోళన వద్దు

● మంత్రి సుబ్రమణ్యం సూచన

ప్యారీస్,ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో వేగంగా వ్యాప్తి చెందుతున్న 'అమీబా' వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు.ఆయన గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ...కార్పొరేషన్, మున్సిపాలిటీ, పశుసంవర్థకశాఖల సహకారంతో వీధి కుక్కల బెడదను నివారించేందుకు పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఉన్న 2,336 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క, పాము కాటుకు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వెంటనే చికిత్స అందుతుందని తెలిపారు. పొరుగురాష్ట్రమైన కేరళలో ఇటీవల కాలంలో మెదడుకు హాని కలిగించే అమీ బా వ్యాధి వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇది రోజుల తరబడి చెరువుల్లో నిల్వవున్న నీటిలో స్నానం చేయడం వల్ల వస్తుందన్నారు.మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశాలు లేవని వైద్య పరీక్షల్లో తేలిందన్నారు. రాష్ట్రంలో ఈ వ్యాధి వ్యాపించకుండా పటిష్ఠచర్యలు చేపట్టినందువల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు.

సమాచార ధ్వని

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో శుక్రవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ప్రకటించింది. తిరువొత్తియూర్ మండలం 13వ వార్డు ఎంజీఆర్ రోడ్డు చెక్‌పోస్ట్, ఆర్‌సీబీ పాఠశాల, మాధవరం మండలం 25వ వార్డు మాధవరం హౌసింగ్ బోర్డు క్రీడా మైదానం, తండయార్‌పేట మండలం 40 వార్డు న్యూ వాషర్‌మెన్‌పేట తిరువళ్లువర్ నగర్‌లోని చెన్నై మహోన్నత పాఠశాల, రాయపురం మండలం 60వ వార్డు జార్జి టౌన్ అంగప్పన్ నాయకన్ వీధిలోని చెన్నై ఉర్దూ మాధ్యమిక పాఠశాల, తిరువిక నగర్ 65వ వార్డు కొళత్తూర్ మసీదు వీధి సమీపంలోని చెన్నై మహోన్నత పాఠశాల, తేనాంపేట మండలం 122వ వార్డు నందనం 2వ క్రాస్ వీధిలోని కార్పొరేషన్ క్రీడా మైదానం, పెరుంగుడి మండలం 188వ వార్డు మడిపాక్కం భజన ఆలయ వీధి సమీపంలోని రుక్మిణి మహల్, షోలింగనల్లూర్ మండలం 199వ వార్డు షోలింగనల్లూర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాల తదితర ఆరు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ఆయా మండల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

'గేట్' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ తదితర కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో మాస్టర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 'గేట్' ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. రానున్న 2026వ విద్యా సంవత్సరానికి 'గేట్' ప్రవేశ పరీక్షకు బుధవారం నుంచి సెప్టెంబరు 28వ తేది వరకు https://gate2026.iitg.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆరు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపుల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా గురువారం నుంచి ఈ నెల 30వ తేది వరకు ఆరు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు చెన్నై మెట్రో వాటర్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... అన్నానగర్ మండలం తిరుమంగళం 100 అడుగుల రోడ్డులోని ప్రధాన తాగునీటి పైపు అనుసంధాన పనులు జరుగుతున్న కారణంగా, మాధవరం మండలంలో మాధవరం, తిరువికనగర్ మండలంలో కొళత్తూర్, అంబత్తూర్ మండలంలో అన్నానగర్ వెస్ట్, మొగప్పెర్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. అలాగే, అన్నానగర్ మండలంలోని అన్నా నగర్, విల్లివాక్కం, తేనాంపేట మండలంలోని వడపళని తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆయా ప్రాంత ప్రజలు అత్యవసర సేవలకు https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే, టాంకర్ లారీల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని వాటర్ బోర్డు తెలిపింది.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1, 1ఏ పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష గత జూన్ 15వ తేది నిర్వహించారు. సబ్ కలెక్టర్, డీఎస్పీ, జాయింట్ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ తదితర 70 పోస్టులకు నిర్వహించిన గ్రూప్1- పరీక్షలకు 2.49 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో, జూన్ నెలలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ప్రిలిమినరీ పరీక్షలో విజయం సాధించిన వారికి వచ్చే డిసెంబరు నెలలో మెయిన్ పరీక్ష జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

ఆవిన్ 'బాదం మిక్స్' రూ.10కి విక్రయం

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 1వ తేది నుంచి 14 గ్రాముల బరువు కలిగిన 'బాదం మిక్స్' పౌడర్ రూ.10కి అందించనున్నట్లు ఆవిన్ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆవిన్ రూ.120కి విక్రయిస్తున్న 'బాదం మిక్స్' పౌడర్‌కు మంచి స్పందన వచ్చింది. వినియోగదారులకు సులభతరంగా వినియోగించేలా 14 గ్రాముల బాదం మిక్స్ పౌడర్ రూ.10కి అందించనున్నారు. ఈ చిన్న ప్యాకెట్‌లోని బాదం మిక్స్, ఒక గ్లాసు పాలలో కలుపుకుని రుచి మారకుండా సేవించవచ్చని, సెప్టెంబరు 1వ తేది నుంచి ఆవిన్ పార్లర్‌లో ఈ చిన్న ప్యాకెట్లు అందుబాటులోకి వస్తాయని ఆవిన్ అధికారులు తెలిపారు.

నేడు ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... గిండి-ఆలందూర్ రోడ్డు సమీపంలోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న జాబ్ మేళాలో, 8, 10, ప్లస్ టూ, ఐటీఐ, డిప్లొమో, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ వృత్తి విద్యా కోర్సులు చేసిన వారు పాల్గొనవచ్చు. ఈ శిబిరంలో 20కి పైగా ప్రైవేటు సంస్థలు పాల్గొని, తమకు అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని కలెక్టర్ తెలిపారు.

5 నుంచి ఉచిత యోగా శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సత్యానంద యోగా సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక వేళచ్చేరి, కేకే నగర్, నంగనల్లూర్ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. వేళచ్చేరి తిరువీధి అమ్మన్ ఆలయంలో సెప్టెంబరు 5వ తేది, కేకే నగర్ పొన్నాంబళం రోడ్డు అయ్యప్ప, గోశాల కృష్ణన్ ఆలయంలో సెప్టెంబరు 6, నంగనల్లూర్ లక్ష్మి నగర్ మెయిన్ రోడ్డులోని శ్రీసుదర్శన్ టెర్రస్ హాలులో సెప్టెంబరు 7వ తేది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నాలుగు వారాల పాటు (సోమవారం నుంచి శనివారం వరకు) ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు తరగతులు జరుగనున్నాయి. ఆసక్తి కలిగిన వారు 9841227709 (నంగనల్లూర్), 8754499334 (వేళచ్చేరి), 6383008358 (కేకే నగర్) నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంటీసీలో అప్రెంటీస్ శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో ఏడాది వృత్తి శిక్షణకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీఐలో మోటార్ వాహన మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు శిక్షణలో పాల్గొనవచ్చు. ఎంపికైన వారికి శిక్షణతో పాటు నెలకు రూ.14,000 ప్రోత్సాహక వేతనం అందించనున్నారు. శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు సెప్టెంబరు 10వ తేది ఉదయం 10 గంటలకు స్థానిక క్రోంపేటలోని ఎంటీసీ శిక్షణా పాఠశాలలో జరిగే ప్రత్యేక శిబిరంలో పాల్గొనవచ్చని ఎంటీసీ తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో నవవరుడు సహా ముగ్గురి మృతి

● శుభలేఖలు పంచుతుండగా విషాదం


మృతులు సెన్నియమ్మాళ్, ఆర్ముగం, నారాయణన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా శంకరాపురం సమీపంలో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో నవ వరుడు సహా ముగ్గురు మృతిచెందారు. తిరుకోవిలూర్ తాలూకా మాడాంపూండి గ్రామానికి చెందిన ఆర్ముగం (42) కుమారుడు నారాయణన్ (23) ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో, వివాహ రిసెప్షన్ సెప్టెంబరు 4వ తేది తిరుకోవిలూరులో జరుగనుంది. అందుకోసం శంకరాపురంలోని బంధువులకు బుధవారం సాయంత్రం ఆర్ముగం, భార్య సెన్నియమ్మాళ్ (40), కుమారుడు నారాయణన్‌తో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఆహ్వాన లేఖలు అందించి తిరుగు ప్రయాణమయ్యాడు. పంకలై జంక్షన్ రోడ్డు ముత్తుమారియమ్మన్ ఆలయం సమీపంలో వస్తున్న బైక్‌ను శంకరాపురం వైపుకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, చుట్టుపక్కల వారు వారిని కళ్లకుర్చి ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు. వారిలో నారాయణన్‌ను మెరుగైన చికిత్సల కోసం సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళ్లకుర్చి ఆసుపత్రిలో చికిత్సలు ఫలించక రాత్రి ఆర్ముగం, సెన్నియమ్మాళ్ మృతిచెందగా, నారాయణన్ సేలం ప్రభుత్వాసుపత్రిలో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై పంకలై జంక్షన్ రోడ్డు పోలీసులు కేసు నమోదుచేసి, కారు డ్రైవర్ సుందరమూర్తి (23)పై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

డీఎండీకే జతకట్టిన కూటమిదే విజయం

● ప్రేమలత విజయకాంత్

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే జతకట్టిన కూటమి విజయం సాధిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ అన్నారు. తిరుచ్చి మానగర జిల్లా డీఎండీకే కార్యదర్శి టీవీ గణేష్ ఇంటి శుభకార్యం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమలత విజయకాంత్ విలేఖరులతో మాట్లాడుతూ... తాము చేపట్టిన 'ఉల్లం తేడి ఇల్లం నోడి' రెండో విడత రథయాత్ర సెప్టెంబరు 5న ప్రారంభమై 10 రోజులు జరుగుతుందన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టిన ప్రచారం, తాము చేపట్టిన ప్రచారం వేరని తెలిపారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకావాలన్నదే తమ అభిప్రాయమన్నారు. అధికార వికేంద్రీకరణ ద్వారా దేశానికి, ప్రజలకు మంచి పాలన అందించేందుకు సాధ్యమవుతుందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే భాగస్వామ్యమైన కూటమి విజయం సాధిస్తుందని, ఏ కూటమిలో తాము చేరాలి అన్న దానిపై జనవరి 9వ తేదీన నిర్వహించనున్న మహానాడులో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం పార్టీ బలోపేతం చేసేలా ప్రచారం చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఎంజీఆర్ అనంతరం ప్రజలకు గుర్తుకొచ్చేది విజయకాంత్ అని, ఏ పార్టీ అయినా విజయకాంత్‌ను ప్రస్తావించకుండా ఉండలేరని అన్నారు. ఆయన గురించి మాట్లాడడం తమకు సంతోషంగా ఉందన్నారు. టీవీకే మహానాడులో కార్యకర్తలను బౌన్సర్లు తోసివేయడం అన్ని పార్టీల్లోనూ జరుగుతుందని, పథకం ప్రకారం ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవని ప్రేమలత విజయకాంత్ తెలిపారు.

అన్నాడీఎంకేను ఆర్‌ఎస్‌ఎస్ నడిపించడంలో తప్పేంటి?

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయాలను అన్నాడీఎంకే వినడం ఆహ్వానించదగ్గ పరిణామమని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా తన గృహంలో వినాయకుడికి పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి, పార్టీ నేతలకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌ఎస్ సంస్థకు చెందిన కార్యకర్తలు కరోనా కాలంలోను, వరదలు, వర్షాలు తదితర విపత్తులు సమయాల్లో ముందుండి సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. అలాంటి సంస్థ అభిప్రాయాలను అన్నాడీఎంకే వినడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వతంత్ర సంస్థగా శతజయంతి జరుపుకుంటోందని అన్నారు. అలాంటి సంస్థ అన్నాడీఎంకేను నడపడంలో తప్పేమిటి అని, ఆర్‌ఎస్‌ఎస్ సంస్థను చూసి టీవీకే అధ్యక్షుడు విజయ్ నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు.

మాజీమంత్రి రాజేంద్రబాలాజీకి ఛార్జిషీటు నకలు అందజేత


మాజీమంత్రి రాజేంద్రబాలాజీ

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి కేటీ రాజేంద్రబాలాజీకి ఆయనపై నమోదైన మోసం కేసుకు సంబంధించిన ఛార్జిషీటు నకలును అందజేసినట్లు పోలీసులు తెలిపారు. రాజేంద్రబాలాజీ తదితరులపై దాఖలైన మోసం కేసు విచారణ శ్రీవిల్లిపుత్తూరు జిల్లా కోర్టులో కొనసాగుతున్న విషయం తెలిసిందే. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో పాడిపరిశ్రమలశాఖ మంత్రిగా వ్యవహరించిన రాజేంద్రబాలాజీ ఆవిన్ సంస్థలో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి పలువురి వద్ద రూ.30లక్షలు పొంది మోసం చేశారని సాత్తూరుకు చెందిన రవీంద్రన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అన్నాడీఎంకే ప్రముఖుడు విజయ్ నల్లతంబి, రాజేంద్రబాలాజీతో పాటు ఆయన సహాయకులు అని మొత్తం 8 మందిపై గత 2021 నవంబర్‌లో విరుదునగర్ ఆర్థిక నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన పోలీసులు గత ఏప్రిల్ 15న న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేశారు. మరుసటిరోజు నుంచి జరిపిన ఈ కేసు విచారణకు ముద్దాయిలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, గురువారం ఈ కేసు విచారణకు రాగా, రాజేంద్రబాలాజీ సహా ఎనిమిది మందికి 150 పేజీలతో కూడిన ఛార్జిషీటు నకలును పోలీసులు అందజేశారు. ఈ కేసు తదుపరి విచారణను అక్టోబర్‌కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జయకుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

'చీప్ అండ్ బెస్ట్' బ్యూటీ పార్లర్ ప్రారంభం


బ్యూటీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలో 'చీప్ అండ్ బెస్ట్' బ్యూటీ పార్లర్ ప్రారంభమైంది. గురువారం జరిగిన కార్యక్రమంలో డీఎంకే జిల్లా సెక్రటరీ, ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో పార్లర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షులు బాబు, కొనవట్టం మాజీ సర్పంచ్ గురువాయూర్ అప్పన్, ఎల్.సంపత్‌కుమార్, ప్రభు షాలిని, హరిహరదాసన్, జయప్రియ, హరి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై నల్లజెండాలతో నిరసన


ఇళ్లకు నల్లజెండాలు కట్టిన గ్రామస్తులు

వేలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుపై గ్రామస్తులు తమ ఇళ్లపై నల్లజెండాలు కట్టి నిరసన తెలిపారు. గుడియాత్తం సమీపం పెరుమాళ్‌కుప్పం గ్రామంలో 100 కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ గ్రామం నుంచి మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే రోడ్డు వసతి లేకుండా ఉంది. రోడ్డు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు జిల్లా అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయింది. రోడ్డు లేకపోవడంతో మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న గ్రామస్తులు, అధికారుల తీరును నిరసిస్తూ తమ ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే తమ పిల్లలను పాఠశాలకు పంపమని గ్రామస్తులు తేల్చిచెప్పారు.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ప్రభావం ఉంటుంది

● టీటీవీ దినకరన్

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 2006 విజయకాంత్‌లాగే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయ్ ప్రభావం ఉంటుందని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. తంజావూరులో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... విజయ్ పార్టీ గురించి పత్రికలు, చర్చా వేదికలపై రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నట్లు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ ప్రభావం తప్పక ఉంటుందని, అన్ని పార్టీల ఓట్ల శాతంపై ప్రభావం చూపుతారని అన్నారు. నేను చెబుతున్నది యథార్థమని, అందుకోసం ఆయనతో కూటమిలో చేరుతామని కాదన్నారు. ప్రతి పార్టీ తాము చేరే కూటమి విజయం సాధిస్తుందని చెబుతున్నారని, డిసెంబరు తర్వాత తాము చేరే కూటమిపై స్పష్టత వస్తుందని దినకరన్ తెలిపారు.

75 ఇంజనీరింగ్ కళాశాలల్లో 98 శాతం సీట్ల భర్తీ

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల భర్తీ కౌన్సెలింగ్ గత జూలైలో కొనసాగింది. ప్రత్యేక విభాగాలు, జనరల్ విభాగం, ప్రభుత్వ పాఠశాలలకు 7.5 శాతం రిజర్వేషన్ల కౌన్సెలింగ్, ఉప కౌన్సెలింగ్ తదితరాలు ముగిసిన నేపథ్యంలో, మంగళవారం ఎస్సీ ఏ కేటగిరీలోని ఖాళీ సీట్లు ఎస్సీ కేటగిరీలోకి మార్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ ప్రకారం, ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ పూర్తికానున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని కళాశాలల్లోని 1,90,494 సీట్లలో 1,53,966 సీట్లు భర్తీ అయ్యాయి. ఆ ప్రకారం, 36,528 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అదే సమయంలో, గత ఏడాది ఖాళీ సీట్ల సంఖ్య 49,579గా ఉంది. ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు పరిశీలిస్తే, గత ఆరేళ్ల కంటే మెరుగ్గా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక, ఇప్పటివరకు లేని విధంగా 75 ఇంజనీరింగ్ కళాశాల్లో 98 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. ఇవి మినహా 105 కళాశాలల్లో 90 నుంచి 97 శాతం వరకు సీట్లు, 59 కళాశాలల్లో 80 నుంచి 90 శాతం, 103 కళాశాలల్లో 50 నుంచి 79 శాతం, 74 కళాశాలల్లో 10 నుంచి 49 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. అదే సమయంలో, 7 కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు సింగిల్ డిజిట్‌లో ఉండడం కొసమెరుపు.

ఆరు బీచ్‌ల అభివృద్ధికి రూ.24 కోట్లు కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'బ్లూ ఫాగ్' సర్టిఫికెట్ పొందేలా, రాష్ట్రంలోని ఆరు సముద్రతీరాలు అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.24 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పర్యావరణ, వాతావరణ మార్పులు, అటవీ శాఖ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నీటి నాణ్యత, పర్యావరణ పరిరక్షణ, భద్రత తదితర 33 అంశాల ఆధారంగా ప్రతి సముద్రతీరానికి 'బ్లూ ఫాగ్' సర్టిఫికెట్ అందజేస్తున్నారని తెలిపింది. ఆ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థానిక తిరువాన్మియూర్, పాలవాక్కం, ఉద్దాండి, తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణం, విల్లుపురం జిల్లా కీల్‌పుదుపట్టు, కడలూరు జిల్లా సామియార్‌పేట తదితర ఆరు బీచ్‌లను అభివృద్ధి చేసి, బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందేలా ఒక్కో బీచ్ మౌలిక వసతులకు తలా రూ.2.124 కోట్లు, భద్రతా ఇతర పనులకు రూ.2.74 కోట్లు చొప్పున మొత్తం రూ.24 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ప్రకటనలో తెలిపారు.

మూడవ విడతగా 125 ఎలక్ట్రికల్ బస్సులు

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడవ విడతగా పూందమల్లి నుంచి 125 బస్సుల సేవలు వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నాయి. పర్యావరణ పరిరక్షణ, డీజిల్ ఖర్చుల తగ్గింపు తదితరాలను దృష్టిలో ఉంచుకొని నగరంలో విద్యుత్ బస్సులు నడపాలని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) నిర్ణయించింది. ఆ ప్రకారం, తొలివిడతగా వ్యాసర్పాడి డిపో నుంచి 122 బస్సులు, రెండో విడతగా పెరుంబాక్కం డిపో నుంచి 135 బస్సులు నడుపుతున్నారు. మూడవ విడతగా వచ్చే నెలలో పూందమల్లి డిపో నుంచి 125 బస్సులు ప్రారంభించనున్నారు. ఇందుకోసం పూందమల్లి డిపోలో 25 ఛార్జింగ్ కేంద్రాలు, డిపో విస్తరణ తదితర పనులు చివరి దశలో ఉన్నాయని, పూందమల్లి నుంచి వివిధ ప్రాంతాలకు ఈ బస్సులు నడుపనున్నట్లు ఎంటీసీ తెలిపింది.


వేలూరు కరిగిరి పంచాయతీలో 'కలైంజర్ కనవు ఇల్లం' పథకంలో నిర్మిస్తున్న గృహాలను గురువారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నందకుమార్

శ్రీరామచంద్ర మెడికల్ ఆసుపత్రిలో వరద సంసిద్ధతపై మాక్ డ్రిల్



చెన్నై, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో ఈశాన్య రుతుపవనాల వరద సంసిద్ధతపై ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. తమిళనాడు అగ్నిమాపకశాఖ అంబత్తూరు సబర్బన్ డిస్ట్రిక్ట్ విభాగం వారు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి పి.లోకనాథన్, అదనపు అధికారి ఎస్.తిరునావుక్కరసు తదితరుల నేతృత్వంలోని 50 మంది అగ్నిమాపక సిబ్బంది ఈ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు. వరదల్లో ఎత్తయిన భవనాల వద్ద చిక్కుకున్న ప్రజలను రక్షించడంపై అవగాహన కల్పించడంతో పాటు అత్యవసర నెంబరు 112 ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న భర్తను పోలీసులకు అప్పగించిన మహిళ

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న భర్తను మహిళ పోలీసులకు పట్టిచ్చిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. తిరువొత్తియూర్ రేడియన్స్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రాజా (28) ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రాజా అదే ప్రాంతానికి చెందిన మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. మత్తుకు బానిసైన రాజా, స్నేహితుల ద్వారా గంజాయి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకుంటోంది. కొద్ది రోజుల క్రితం రాజా గదిలో గంజాయి ప్యాకెట్‌ను చూసిన భార్య, ఈ విషయమై అతడిని ప్రశ్నించగా, 'అది తనకు కాదని, కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు' తెలిపాడు. ఈ విషయమై ఇరువురి మధ్య ఏర్పడిన వివాదంతో ఆగ్రహించిన రాజా, భార్యను చితకబాది బయటకు వెళ్లిపోయాడు. ఈ ఘటనలో గాయాలపాలైన రాజా భార్య ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకుంది. ఆ సమయంలో రాజా ఇంట్లో లేడని తెలుసుకున్న భార్య, పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి, తమ ఇంట్లో గంజాయి ఉందని, భర్త రాజా విషయాన్ని కూడా తెలియజేసింది. దీంతో, పోలీసులు ఇంటికి చేరుకుని గంజాయి స్వాధీనం చేసుకుని రాజాను అరెస్ట్ చేశారు. రాజాకు గంజాయి విక్రయించిన అదే ప్రాంతానికి చెందిన హరిహరన్‌ను కూడా అరెస్ట్ చేసిన పోలీసులు, హరిహరన్‌కు గంజాయి అందిస్తున్న వారి కోసం గాలిస్తున్నారు.

నీలగిరి వెలింగ్టన్ సైనిక శిక్షణ పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలోని రాజ్‌భవన్, వెలింగ్టన్ సైనిక శిక్షణ పాఠశాల అనే రెండు ప్రాంతాలకు గురువారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయమై అధికారులు జిల్లా ఎస్పీకి సమాచారం అందించారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు రెండు బృందాలుగా రాజ్‌భవన్, వెలింగ్టన్ సైనిక శిక్షణ పాఠశాలకు వెళ్లి, పోలీసు జాగిలాల సాయంతో తనిఖీలు చేపట్టి, పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన సైబర్ క్రైం పోలీసులు, ఈ-మెయిల్ చిరునామా కోసం విచారణ చేపట్టారు.

పామును బంధించబోయి... కాటుకు బలైన యువకుడు


రాజమురుగన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి ఇంట్లో దాగిన పామును బంధించబోయిన యువకుడు, ఆ పాము కాటుకు గురై మృతిచెందిన ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. నిలవరపట్టి ప్రాంతానికి చెందిన రాజమురుగన్ వెల్డింగ్ పనులకు వెళ్తుంటాడు. తండ్రి మృతిచెందగా, అనారోగ్యంతో ఉన్న రాజమురుగన్ తల్లితో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో, తమ ఇంట్లో పాము ఉందని స్నేహితుడు తెలుపడంతో, దానిని బంధించేందుకు రాజమురుగన్ వెళ్లాడు. పాము తలపై కట్టె ఉంచి దానిని పట్టుకునే సమయంలో, పాము రాజమురుగన్ చేతిపై కాటు వేసింది. అనంతరం చేతికి గుడ్డ చుట్టుకున్న రాజమురుగన్, మళ్లీ దానిని పట్టుకునే సమయంలో స్పృహ తప్పడంతో స్నేహితులు అతడిని వెంటనే సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే విషం శరీరం పూర్తిగా పాకడంతో వైద్య చికిత్సలు ఫలించక మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


నదియ (ఫైల్ ఫొటో)

వేలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలో విద్యుదాఘాతానికి బాలిక మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. నత్తమ్ గ్రామానికి చెందిన కుమరన్-జానకి దంపతుల కుమార్తె నదియ (5), అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. బుధవారం రాత్రి ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టు నరుకుతున్న సమయంలో చెట్టు కూలి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో పక్కనే ఆడుకుంటున్న నదియకు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై గుడియాత్తం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. తాంబరం: కృష్ణా నగర్, వెట్రి నగర్, కృష్ణా నగర్ 1 నుంచి 8 వీధులు, సుభాష్ నగర్, రమణి నగర్, మల్లిగ నగర్, కుమరన్ నగర్, పార్వతి నగర్, శ్రీరామ్‌నగర్ సౌత్, సరస్వతి నగర్, శ్రీరామ్ నగర్ నార్త్ పార్ట్-1, ముడిచూర్ రోడ్డు కొంత భాగం, పాత పెరుంగళత్తూర్, బాలకృష్ణ నగర్. కడపేరి: మెస్ రోడ్డు, కన్నన్ వీధి, బౌండ్ వీధి, జీఎస్‌టీ రోడ్డు, రంగ వీధి, యాదవాల్ వీధి, జయ వీధి, రాజగోపాల్ వీధి, థామస్ వీధి, నార్త్ కులకరై, సౌత్ కులకరైవీధి, శ్రీనివాసవీధి, జానకిఅమ్మాళ్ వీధి, తిరువిక నగర్ 1,2,3వీధులు, ఆర్వీ గార్డన్. ఆవడి: టీఎన్‌హెచ్‌బీ ఆవడి, కామరాజ్ నగర్, జేబీ ఎస్టేట్, వసంతం నగర్, ఆవడి మార్కెట్, పరుత్తిపట్టు, గోవర్ధనగిరి, అన్నామలై నగర్, గౌరి నగర్. ఆర్కే నగర్: ఎస్‌ఏ ఆలయం, తిలంగర్ నగర్, ఏలయముదాలి వీధి, వీఓసీ నగర్, ఆర్కే నగర్, మింట్, కల్‌మండపం, టీహెచ్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ తోట్టం, అరణి రంగన్ వీధి, కామరాజ్ కాలనీ, తిరునావక్కరసు తోట్టం, కోదండరామర్ వీధి, ట్రోడ్ ఏరియా, స్టాన్లీ ఏరియా, త్యాగప్పన్ వీధి, పసువయాన్ వీధి, టోల్ గేట్, కన్నికోయిల్ ఏరియా. పెరుంగుడి నార్త్: సీబీఐ కాలనీ, పిళ్లయార్ ఆలయ వీధి, కురింజి నగర్, రామప్ప నగర్, రాజ్యలక్ష్మి అవెన్యూ, కామరాజ్ నగర్, వీరస్వామి రోడ్డు, టెలిఫోన్ నగర్.

కంటి సమస్యలపై అశ్రద్ధవద్దు



డా.గిరిధర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు


పెరంబూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలపై అశ్రద్ధ చూపరాదని వైద్య నిపుణులు ప్రజలకు సూచించారు. స్థానిక టి.నగర్ హిందీ ప్రచార సభ వీధి సమీపంలో రాధాత్రి నేత్రాలయ 17వ వార్షికోత్సవం జీఆర్‌టీ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ డా.ప్రవీణ్ కృష్ణ అధ్యక్షతన, కంటి సంబంధిత సమస్యలు, చికిత్సా విధానాలపై నిర్వహించిన సదస్సులో దేశవ్యాప్తంగా 135 మంది కంటి వైద్య నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కంటి వైద్యంలో విశిష్ట సేవలందిస్తున్న కేరళ వైద్యులు డా.గిరిధర్‌కు ముఖ్యఅతిథి ఫోర్బ్స్ ఇండియా వ్యవస్థాపక ఛైర్మన్ ఎస్వీ వీరమణి అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని రాధాత్రి నేత్రాలయ మెడికల్ డైరెక్టర్ వాసుమతి వేదాంతం పర్యవేక్షించారు.

వార్షికోత్సవాలకు ముస్తాబైన వేలాంకన్ని మేరీమాత క్షేత్రం

● నేడు పతాకావిష్కరణ



ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా వేలాంకన్ని ప్రాంతంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సెయింట్ మేరీమాత క్షేత్రంలో 10 రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవాలు శుక్రవారం పతాకావిష్కరణలతో ప్రారంభం కానున్నాయి. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఈ ఆలయంలో ప్రతిఏటా జరుపుకునే ఉత్సవాల్లో దేశ, విదేశాల నుండి భక్తులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో పాల్గొనడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాలను శుక్రవారం సాయంత్రం 6 గంటలకు తంజావూరు జిల్లా బిషప్ సహాయరాజ్ ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభంపై మేరీమాత స్వరూపంతో రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభిస్తారు. ఉత్సవాల రోజుల్లో ఆలయంలో తమిళం, తెలుగు, ఆంగ్లం, హిందీ, మళయాళం, కన్నడం, కొంకిణి, ఒరియా, మరాఠి తదితర భాషల్లో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఆరోగ్యమాత రథోత్సవం సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి 7 గంటలకు జరుగుతుంది. మరుసటి రోజు అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న పట్టాభిషేకంలో క్యాథలిక్ చర్చీల పాదర్లు పాల్గొని ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇదిలా వుండగా, వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు పలు రాష్ట్రాలనుండి వేలాది మంది భక్తులు వేలాంకన్నికి తరలివెళుతున్నారు. నాగపట్నం ఎస్పీ సెల్వకుమార్ నేతృత్వంలో పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. ఈ క్షేత్రంలో పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. ఆలయం తరుఫున భక్తులు విశ్రాంతి పొందేందుకు అక్కడక్కడ పందిళ్లు ఏర్పాటయ్యాయి. గురువారానికే పెద్దసంఖ్యలో తరలివెళ్లిన భక్తులతో వేలాంకన్ని ప్రాంతం కిటకిటలాడుతోంది. ఆ ప్రాంతంలో ఉన్న సముద్రంలో దిగి భక్తులు స్నానమాచరించకుండా నిషేధం విధించిన పోలీసులు సముద్రతీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాంకన్నికి స్టేట్ ఎక్స్‌పోర్టు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ప్రత్యేక బస్సులు, దక్షిణరైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నాయి.


పీచుమిఠాయిలతో వినాయకుడు



చలువరాతి వినాయకుడు - కాంచీపురంలో కనువిందు చేస్తున్న కరెన్సీ వినాయకుడు


ఆకట్టుకుంటున్న ఆల్చిప్పలో గణనాథుడు


పూజలందుకుంటున్న నాణేల వినాయకుడు


కరెన్సీ వినాయకుడు


డ్రైఫ్రూట్స్ వినాయకుడు

పర్యావరణ హితులు ఈ గణనాథులు


మెరిసిపోతున్న ఇత్తడి బిళ్లల వినాయకుడు


పసుపు కుంకుమ ప్యాకెట్లతో రూపొందించిన విఘ్నేశ్వరుడు

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే రాష్ట్రంలో ఏ వీధి చూసినా ఆధ్యాత్మికశోభతో కళకళలాడుతుంటాయి. గణనాథుడికి కేవలం పూజలే కాకుండా వివిధ ఆకృతులతో అందరినీ ఆకట్టుకునే ప్రతిమలను ప్రతిష్ఠించే మండపాల నిర్వాహకులు ఈసారి కూడా తమ అభిరుచిని చాటుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ఆకృతులతో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడి విగ్రహాలు అమితంగా ఆకర్షిస్తున్నాయి. ఎక్కడా లేని విధంగా తమ గణనాథుడు ఆకర్షణీయంగా ఉండాలని కళాకారులు తమ సృజనాత్మకతకు మెరుగులు దిద్ది సరికొత్త వేషధారణలతో గణనాథుడిని రూపొందించారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలుగకుండా పసుపు, కుంకుమ, చెరకుగడలు, రుద్రాక్షలు, మొక్కజొన్న కంకులు, మిఠాయిలు, డ్రైఫ్రూట్స్, నాణేలు, కరెన్సీ నోట్లు, ఇత్తడి బిళ్లలు, వెదురు తదితర వస్తువులతో ప్రతి ఏడాది పూజకు వినియోగించే వినాయకుడిని ఒక్కో విధంగా తయారు చేసి ఈసారి కూడా వినాయక మండపాల నిర్వాహకులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. రాష్ట్రప్రభుత్వ సూచనల మేరకు మట్టి గణపతిని ఏర్పాటు చేసి తమ వంతు పర్యావరణాన్ని కాపాడుతున్నామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కాంచీపురంలోని కామాక్షి అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న ఏలేల సింహ వినాయకుడి ఆలయంలో చతుర్థిని పురస్కరించుకుని మూలవర్ విగ్రహాన్ని రూ.15లక్షల కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా పలుప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పర్యావరణ హితం లంబోదరుడి అందాలను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలను పటిష్ఠంచేశారు.

మిన్నంటిన చవితి సంబరాలు

ఊరంతా ఒక్కటిగా కలసి వినాయక చవితి పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో తెలుగువారు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో లంబోదరుడి భారీ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను బుధవారం నుంచి నిర్వహిస్తున్నారు. వచ్చే ఆదివారం నిమజ్జనం వరకు పలు ప్రాంతాల్లో భజన, నృత్య, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు సిద్ధంచేశారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

కాకలూరులో...

తిరువళ్లూర్ జిల్లా కాకలూరులోని సెల్వ గణపతి ఆలయంలో 39వ వార్షిక వినాయక చతుర్థి వేడుకల సందర్భంగా స్వామివారికి బుధవారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక అభిషేకం, అలంకారం, అర్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ స్థాపకుడు శ్రీమన్నారాయణ, కమిటీ సభ్యులు టి.మునినాదన్, జి.వరదరాజన్, ఆర్.రాజా, జి.కృష్ణన్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రిప్లికేన్‌లో...

ట్రిప్లికేన్ సైదోజీ లైన్‌లో సెల్వవినాయగర్ ఆలయం 33వ వార్షిక చవితి వేడుకల సందర్భంగా శివమేళం, శివ తాండవంతో కళాకారులు హోరెత్తించారు. అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) సెంట్రల్ చెన్నై అధ్యక్షుడు కుంకు దశరథరావు అధ్యక్షతన గణపయ్యకు ఉండ్రాళ్లు, కుడుములు, పూర్ణాలు, లడ్డు తదితర 9రకాల వంటకాలు, వంటకాలు నివేదించారు. నవధాన్యాలతో విఘ్నం లేకుండా ఉండాలన్న కోరికతో అభిషేకించారు.కళాకారులు శివమేళం పేరుతో భక్తి సంగీతం అందించి నృత్యాలతో హోరెత్తించారు. ఇ.వెంకటేశన్, కేవీ యువరాజ్, ఆర్.సురేష్, బి.సతీష్, వీబీ భాస్కర్ కన్నన్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.చవితిని పురస్కరించుకొని ఉదయం,మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.



కాకలూరు సెల్వగణపతి దేవాలయంలో మహా అభిషేక పూజలు - ట్రిప్లికేన్‌లో శివమేళంతో హోరెత్తిస్తున్న కళాకారులు

పుళల్‌లో....

స్థానిక పుళల్ కావాంగరై తెలుగు పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కర్పగ వినాయకుడి ప్రతిమను 9వ సంవత్సరం ప్రతిష్ఠించారు. ఈ సంవత్సరం మంగళవారం సాయంత్రం నుంచే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గణపతి మండపం ప్రాంగణంలో హోమం, అర్చన, అలంకార పూజలు ప్రారంభించి ప్రసాద వినియోగించారు. బుధవారం రాత్రి మహా గణపతి పూజ, భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించారు. గురువారం ఉదయం భారీ లడ్డూ వేలం వేసి అందరూ ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం అనంతరం మహా గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. సంఘ నిర్వాహకుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గణనాథుడిని సేవించారు.



స్థానిక పుళల్ కావాంగరైలో తెలుగు పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం - కన్నమ్మపేటలో ఆస్కా మాజీ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు

చూలైలో...

స్థానిక చూలై కాట్బారు నల్లముత్తు వీధిలో హిందూ మున్నని సెంట్రల్ చెన్నై జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓం శ్రీ శివశక్తి వినాయకుడి ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. నిర్వాహకులు పసుమర్తి శ్రీనివాసన్, పసుమర్తి బాబు, జయరావు, నాగయ్య, రామారావు, గోవిందరాజులు, కృష్ణ, పరచు వెంకట రమణయ్య, పోలయ్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ ఆదివారం గణపతి ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


చూలైలో పూజలందుకుంటున్న శివశక్తి వినాయకుడు

కన్నమ్మపేటలో....

స్థానిక టి.నగర్ సమీపంలోని కన్నమ్మపేటలో గణేష్ చతుర్థి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లవ గ్రూప్స్ సంస్థల అధినేత డాక్టర్ కె.సుబ్బారెడ్డి పాల్గొనగా, నిర్వాహకులు ప్రభాకర్ తదితరులు సంప్రదాయ మర్యాదలతో ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులందరికీ అన్నప్రసాదాలు వినియోగించారు.

కోలాహలంగా వినాయక చతుర్థి


ప్రత్యేక అలంకారంలో విఘ్నేశ్వరుడి ప్రతిమ

తిరుత్తణి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని బజారువీధిలోని ఎక్స్‌టెన్‌లో వలంపూరి వినాయకర్ గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గణేశుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో సన్నిధికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో, భక్తులు కోరికలతో కూడిన చీటీలను వినాయకుడి విగ్రహానికి పూల మాలగా వేసి తమ కోరికలను తీర్చమని వేడుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

పళ్లిపట్టులో...


గణేష్ పూజల్లో కమిటీ నిర్వాహకులు

తిరుత్తణి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు వానియర్‌వీధిలోని వరసిద్ధి వినాయక ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయక చవితిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ కమిటీ నిర్వాహకులు భరత్, దివాకర్, వంశీ, రవి, శరవణ, చరణ్, వినోద్, తిలక్, అభిషేక్, యోగేష్, ఉత్తం, విశాల్, యువరాజ్, విక్కీ, హరీష్, గౌతమ్, కార్తిక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

తారల ఇంట చవితి వేడుకలు


డెల్నా డెవిస్


నిధి అగర్వాల్


నటి అతుల్యా రవి

గణనాథుడి పండుగ వినాయక చవితి అందరికీ అతి పవిత్రమైనదే. బొజ్జగణపతిని ప్రసన్నం చేసుకుని కావాల్సిన కోర్కెలు తీర్చాలంటూ మొక్కని భక్తులెవరుంటారు? అందుకే వినాయక చతుర్థినాడు అతి సామాన్యుల నుంచి సినీ తారల దాకా అందరూ భక్తితో ప్రసన్నవదనుడిని పూజించి, కొలుస్తారు. అలా పార్వతీపుత్రుడిని కొలిచిన కొంతమంది సినీతారల విశేషాలివే..!

- అడయార్, ఆంధ్రజ్యోతి





గణేష్ పూజలో హీరో హరీష్ కళ్యాణ్ - భర్తతో నటి అభినయ - భర్తతో నటి సిమ్రాన్ - వినాయక చవితి వేడుకల్లో ఖుష్బూ కుటుంబ సభ్యులు

'కూలీ' చిత్రానికి 'యూ-ఏ' సర్టిఫికెట్ పంపిణీ చేయలేం

- మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నటుడు రజనీకాంత్ 'కూలీ' చిత్రానికి యూ-ఏ సర్టిఫికెట్ పంపిణీ చేయలేమని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రజనీకాంత్ నటించి ఇటీవల విడుదలైన కూలీ చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ పంపిణీ చేయడం వల్ల ఈ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లలో పిల్లలను అనుమతించడంలేదు. అందువల్ల ఈ చిత్రానికి యూ-ఏ సర్టిఫికెట్ పంపిణీ చేయాల్సిందిగా సెన్సార్ బోర్డుకు ఉత్తర్వులు జారీచేయాలంటూ కూలీ చిత్ర నిర్మాణ సంస్థ సన్‌టీవీ నెట్‌వర్క్స్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఈ కేసు జస్టిస్ తమిళ్ సెల్వీ ముందు ఇటీవల విచారణకు వచ్చిన సమయంలో సెన్సార్ బోర్డు తరుపున దాఖలు చేసిన నివేదికలో ఆ చిత్రంలో అధికంగా ఫైటింగ్ సన్నివేశాలు, మద్యం, ధూమపానం సేవించే సన్నివేశాలతో పాటు అసభ్యకరమైన సంభాషణలున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, కూలీ చిత్రాన్ని వీక్షించిన రెండు ప్రత్యేక బృందాలు ఈ చిత్రాన్ని చూసేందుకు చిన్నారులకు అర్హులుకారని నిర్ధారించారు. అందువల్ల 'ఏ' సర్టిఫికెట్ పంపిణీ చేయాలని సిఫారసు చేశారు. ఇరుతరుపు వాదనలు విన్న అనంతరం ఈ కేసు తీర్పును తేదీ ప్రకటించకుండా న్యాయమూర్తి వాయిదా వేశారు. గురువారం మళ్లీ విచారణకు వచ్చిన ఈ కేసులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన కూలీ చిత్రానికి యూ-ఏ సర్టిఫికెట్ పంపిణీ చేయలేమని ఆదేశించిన న్యాయస్థానం సన్‌టీవీ నెట్‌వర్క్స్ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

స్వర్ణాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు


వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న శక్తి అమ్మ

వేలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపురం స్వర్ణాలయం, నారాయణి పీఠంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వర్ణాలయంలో ఉన్న వెండి వినాయక విగ్రహానికి శక్తి అమ్మ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించి, మహాదీపారాధన చేశారు. అనంతరం 1,008 కుడుములు, పండ్లు, చక్కెర పొంగలి, పులిహోర తదితరాలు స్వామివారికి నైవేద్యంగా అందజేసి భక్తులకు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులను శక్తి అమ్మ ఆశీర్వదించారు.

ఘనంగా చెన్నైస్ అమృత 9వ స్నాతకోత్సవం

అడయార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నైస్ అమృత గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ తన 9వ స్నాతకోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. నగరంలోని ఒక నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ వేడుకలో చెన్నై, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నగరాల్లో ఆ సంస్థకు చెందిన విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన సుమారు 400 మంది పట్టభద్రులు పాల్గొని, తమ డిగ్రీలను స్వీకరించారు. ఓపెన్ యూనివర్శిటీ మలేషియా, ఫ్యూచర్ డ్రీమ్ అకాడమీ - మలేషియాకు చెందిన ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీలు స్వీకరించిన విద్యార్థులను చెన్నైస్ అమృత గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ఆర్.భూమినాథన్ అభినందించారు. అలాగే ఓయూఎంతో ఉన్న సుదీర్ఘ అవగాహనా ఒప్పందాన్ని ఆయన వివరిస్తూ, విదేశాల్లో చెన్నైస్ అమృతా విద్యా సంస్థ విద్యార్థులకు ఉన్న గుర్తింపు, ఉపాధి అవకాశాలను వివరించారు. ఇప్పటివరకు దేశ విదేశాల్లో 27 వేల మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్టు ఆయన తన ప్రసంగంలో గుర్తు చేశారు.


డిగ్రీ పట్టాలతో విద్యార్థులు




కొల్లు రవీంద్ర, అన్బుమణి రామదాస్ - జస్టిస్ బాలాజీ

తిరుమలలో ప్రముఖులు


తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధ, గురువారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ బాలాజీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామదాస్ ఉన్నారు.

తిరుమలలో పర్యావరణ ప్రణాళిక రూపొందించండి

● ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వృక్ష సంపద పెంపు, మానవులు-వన్యప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై అటవీశాఖ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన సమీక్షలో జేఈవో వీరబ్రహ్మంతో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు పాల్గొన్నారు. గతేడాది తిరుమలలో చేపట్టిన వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి వాటిపై డీఎఫ్‌వో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు తాండ్ర, రావి, ఉసిరి, వెలగ, జువ్వి, మర్రి, నేరేడు, అత్తి, ఎర్రచందనం వంటి 7 వేల మొక్కలు నాటినట్టు వివరించారు. వాటర్‌షెడ్, మట్టిస్థిరీకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా అలిపిరి-తిరుమల మార్గాల్లో రెండువైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌరశక్తితో నడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. శ్యామలరావు మాట్లాడుతూ..మరింత ఆధునిక నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమ, మంగళవారాల హుండీ ఆదాయం: రూ.6.55 కోట్లు

మంగళ, బుధవారాల్లో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 1,55,022

తలనీలాలు సమర్పించినవారు: 44,608

'ఇంటి గణపయ్య'ల నిమజ్జనం





తిరుపతిలోని ఇళ్లల్లో వినాయక ప్రతిమలతో 'చవితి' పూజలు నిర్వహించిన వారిలో చాలామంది బుధవారం సాయంత్రమే విగ్రహాలను నిమజ్జనం చేశారు. కుటుంబ సమేతంగా వినాయక సాగర్‌కు విగ్రహాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కొన్ని పెద్దవిగ్రహాలనూ తీసుకొచ్చారు. కాగా, మండపాల్లోని భారీ విగ్రహాలను ఐదో రోజైన ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి



సమన్వయంతో ముందుకు సాగేలా..!

● నేటి దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, పోలీసు ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం ఉదయం జరిగే సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 65 మంది అధికారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి దాదాపు ఏడు కమిటీలను నియమించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పాండిచ్చేరి, లక్షదీప్, అండమాన్ నికోబార్ నుంచీ పోలీసు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. గురువారానికే నలుగురు డీజీపీలు సహా మొత్తం 56 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరికి 14 మందికి హోటల్ తాజ్, 42 మందికి గ్రాండ్ రిడ్జ్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలు, ఉగ్రవాద నిర్మూలన, ఎర్రచందనం స్మగ్లింగ్, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, అంతర్రాష్ట్ర నేరస్థుల ముఠాలను పట్టుకోవడం, సైబర్ క్రైం, నూతన టెక్నాలజీ వినియోగం, సమాచార మార్పిడి వంటి అంశాలపై చర్చించనున్నారు. ప్రధానమైన పది అంశాలపై చర్చించి.. సంయుక్తంగా ముందుకెళ్లడానికి కార్యాచరణ రూపకల్పనకు చర్యలు చేపట్టనున్నారు.

అర్హులైన దివ్యాంగులకు న్యాయం

● కలెక్టర్ వెంకటేశ్వర్ భరోసా



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీడబ్ల్యూడీ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పింఛను రీవెరిఫికేషన్‌లో ఇబ్బంది కలిగి ఉంటే సరిదిద్ది న్యాయం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ దివ్యాంగులకు భరోసా ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ(పీడబ్ల్యూడీ)తోపాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులు వచ్చిన వారందరికీ అప్పీలు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. సంబంధిత ఆస్పత్రుల్లో సదరం వెరిఫికేషన్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఇబ్బందులు పరిష్కరిస్తారన్నారు. అనర్హులకు పింఛను అందుతుందనే ఉద్దేశంతో పునఃపరిశీలన చేశామే తప్పా దివ్యాంగులపై ప్రభుత్వానికి ఎలాంటి కక్షా లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రామచంద్ర, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల వికాసానికి అగ్రాసనం

● పీఎంఏజీవై నిధులతో ఎస్సీ గ్రామాలకు ప్రగతిబాట ● రెండో విడత 53 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

● రూ.11.20కోట్లతో పలు అభివృద్ధి పనులు ● గత పాలనలో ఈ పథకం నిధులు పక్కదారి



పెళ్లకూరు మండలం పునబాక ఎస్సీకాలనీలో పైపులైను వేస్తున్న దృశ్యం



వాకాడు మండలం బుడిగాలవాగులో సీసీరోడ్డు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.గతేడాది పల్లెలు చేపట్టింది మొదలు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వస్తోంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానస్థితికి చేరిన రహదారుల్లో చాలాముటుకు రూపురేఖలు మార్చింది. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. కేంద్రం ఇస్తున్న ప్రతిపైసాను వెచ్చిస్తూ చిత్తశుద్ధిని చాటుకుంటోంది. ఈక్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై)-2 కింద మంజూరైన నిధులతో ఎస్సీ పల్లెల వికాసానికి సంకల్పించింది.

చేపట్టాల్సిన పనులపై సర్వే: జిల్లాలో పీఎంఏజీవై పథకం రెండో విడతలో షెడ్యూల్‌కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, భవనాలు, ఓవర్‌హెడ్‌ట్యాంకులు, మినరల్ వాటర్‌ప్లాంట్లు, శ్మశానవాటికల నిర్మాణంలతో పాటు జీవనోపాధి నైపుణ్యాభివృద్ధికీ ఈ నిధులు వెచ్చించనుంది. గ్రామానికి రూ.20లక్షలు చొప్పున మలివిడత ఎంపికైన 53 గ్రామాల్లో మంజూరైన రూ.11.20కోట్లతో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులు సర్వే చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిధుల పక్కదారి : వైసీపీ హయాంలో పీఎంఏజీవై కింద మొదటి విడతలో 118 గ్రామాల అభివృద్ధికి కేంద్రం రూ.23.60కోట్ల మేర ఆర్థిక సాయం ప్రకటించింది. అందులో రూ.8కోట్లు రాగా నాటి పాలకులు అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించారు. క్షేత్రస్థాయిలో పనులు జరగకుండా సుమారు రూ.2కోట్ల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టాక విడుదలైన మరో రూ.8కోట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించేలా శ్రద్ధ వహించారు. రెండవ విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించినట్లు పీఎంఏజీవై జిల్లా కన్వీనర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి భరోసా

ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పీఎంఏజీవై పథకం భరోసాలాంటిది. మొదటి విడతలో పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసి చాలా వరకు పనులను పూర్తి చేశాం. రెండవ విడతలో 11.20కోట్లతో మారుమూల గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతిపైసాను సద్వినియోగం చేస్తాం. పనుల్లో నాణ్యత లోపించినా, అవినీతి జరిగినా ఉపేక్షించేదిలేదు.

- వెంకటేశ్వర్, కలెక్టర్

ఆంబూరు ఘర్షణ కేసులో 161 మంది విడుదల

ప్యారీస్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కలకలం సృష్టించిన ఆంబూరు ఘర్షణ కేసులో 161 మందిని న్యాయస్థానం విడుదల చేస్తూ గురువారం తీర్పువెలువరించింది. వేలూరు జిల్లా పళ్లికొండ కుచ్చిపాళయంకు చెందిన పళని భార్య పవిత్ర (25) గత 2015 మే 24న కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు తిరుపత్తూరు జిల్లా ఆంబూరుకు చెందిన షమీర్ అహ్మద్ (26)ను అదే సంవత్సరం జూన్ 15న విచారణ కోసం అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌మార్తిన్‌సెల్వరాజ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అప్పుడు హఠాత్తుగా అస్వస్థతకు గురైన షమీర్ అహ్మద్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక జూన్ 26న మృతిచెందిన సంఘటన ఆంబూర్ ప్రాంతంలో కలకలంరేపింది. జూన్ 27వ తేదీ రాత్రి 7 గంటలకు ఆంబూరు జాతీయ రహదారిలో గుమిగూడిన సుమారు 500 మందికి పైగా ఆందోళకారులు షమీర్ అహ్మద్ మృతికి కారణమైన పోలీసులను అరెస్టు చేయాలని రాస్తారోకో నిర్వహించారు. అప్పుడు పోలీసులు-ఆందోళకారుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో 15 మంది పోలీసులు సహా 95 మందికి గాయాలయ్యాయి. 30కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, లారీలు, 7 పోలీసు వాహనాలు, 4 మోటారు బైకులు ధ్వంసమయ్యాయి. ఈ ఘర్షణలకు సంబంధించి 191 మందిపై పోలీసులు 12 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి 100 మందిని అరెస్టు చేసి వేలూరు, కడలూరు, సేలం జైళ్లకు తరలించారు. సీబీసీఐడీ గత పదేళ్లకు పైగా నిర్వహించిన దర్యాప్తు పూర్తికావడంతో ఈ కేసు తీర్పును గురువారం తిరుపత్తూరు జిల్లా ప్రిన్సిపల్ సెసెన్స్ కోర్టు న్యాయమూర్తి మీనాకుమారి వెల్లడించారు. ఇందులో 161 మందిని విడుదల చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఘర్షణ జరిగిన సమయంలో ప్రజా ఆస్తులను ధ్వంసం చేశారనే కారణంతో మాజీ ఎమ్మెల్యే అస్లామ్‌బాషా ఆస్తులను స్వాధీనం చేసుకుని నష్టాన్ని సరిచేయాలని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తిరుపత్తూరు జిల్లాలో ప్రధాన రహదారుల్లో మోహరించిన పోలీసులు

క్రీడావిజేతలు విశాఖకు పయనం



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు గురువారం విశాఖపట్నానికి బయలుదేరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వీరికి సీఎం చంద్రబాబు క్రీడాకారులకు బహుమతులు, పతకాలు ప్రదానం చేయనున్నారు. ఈక్రమంలోనే ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు దాదాపు 50మంది తరలివెళ్లారు. వీరికి డీఎస్‌డీవో శశిధర్ వారికి అభినందనలు తెలియజేశారు.

యువకుడి దారుణ హత్య

● పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని జామాయిల్ తోట వద్ద బుధవారం శివారెడ్డి అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... మండల పరిధిలోని అమ్మపాళెం గ్రామానికి చెందిన ఆటుమడుగు ఈశ్వరయ్య కుమారుడు శివారెడ్డి(25) వెంకటగిరిలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి వెంకటగిరికి వచ్చాడు. రాత్రి ఇంటికి ఆకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా రాత్రి 9గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి రైల్వేస్టేషన్ సమీపం వరకు వెళ్లడాన్ని గుర్తించారు. బుధవారం ఉదయం జామాయిల్ చెట్ల మధ్య శివారెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పాటు సమీపంలో పగిలిన బీరు బాటిళ్లు ఉన్నాయి. వెంటనే పోలీసు స్టేషనుకు సమాచారం ఇవ్వగా తాము వినాయక చవితి ఉత్సవాల్లో బిజీగా ఉన్నామని పోలీసులు చెప్పారు. గురువారం ఉదయం గూడూరు డీఎస్పీ గీతాకుమారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమ్మపాళెం గ్రామానికి చెందిన జానకీరామయ్య, సాయిలను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు. ఆమె వెంట సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు ఉన్నారు.

మద్యం వివాదం

● స్నేహితుడి హత్య - ఇద్దరి అరెస్టు

అడయార్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగే సమయంలో ఏర్పడిన గొడవ కారణంగా స్నేహితుడిని హత్య చేసిన ఇద్దరు స్నేహితులను విల్లుపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జిల్లాలోని కండమానడి గ్రామానికి చెందిన సంపత్ (22), శక్తివేల్ (20), అదే జిల్లాలోని కరువేపిల్లై పాళెంకు చెందిన తులసి (20) అనే ముగ్గురు స్నేహితులు అపుడపుడూ కలిసి మద్యం సేవించేవారు. ఈ నెల 20వ తేదీన ఈ ముగ్గురు మద్యం సేవిస్తుండగా ఏర్పడిన గొడవ కారణంగా తులసిని హత్య చేసి పారిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి.. హత్యకు పాల్పడిన సంపత్, శక్తివేల్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడపళని కావేరి హాస్పిటల్‌లో
స్పోర్ట్స్ ఆర్థోస్కోపిక్ సెంటర్



సెంటర్‌ను ప్రారంభిస్తున్న క్రికెటర్ సాయికిశోర్, డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తదితరులు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని కావేరి హాస్పిటల్‌లో స్పోర్ట్స్ మెడిసిన్ అండ్ ఆర్థోస్కోపిక్ సెంటర్‌ను గురువారం ఉదయం ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సాయి కిశోర్ ప్రారంభించారు. క్రీడాకారులు, యువకులకు మోకాలి కీళ్లలో ఏర్పడే నొప్పులను నివారించే దిశగాను, కీళ్ల మార్పిడి, మోకాలి చిప్పల మార్పిడి చికిత్సలను అందించటానికే ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తీవ్ర గర్భస్రావంతో బాలిక మృతి

తిరుత్తణి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో గర్భవతి అయిన ఓ బాలిక తీవ్రగర్భస్రావంతో తిరుత్తణిలోని ఆస్పత్రిలో మృతిచెందింది. వివరాల్లోకి వెళితే తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పొదట్టూర్‌పేట సమీపంలోని ఓ గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన 17యేళ్ల బాలిక అదేప్రాంతానికి చెందిన ఆమె బంధువైన 17యేళ్ల బాలుడితో గత ఏడాది ప్రేమలో పడింది. ఈ నేపథ్యంలో, కొన్ని నెలల క్రితం బాలిక గర్భం దాల్చినట్లు తెలిసిన ఆ బాలుడు ఊరి నుంచి పరారయ్యాడు. దీనిపై అందిన సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పురిటినొప్పులు వస్తున్న ఆ బాలికను తిరుత్తణిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆమె తల్లిదండ్రులు తరలించగా, బాలికకు తీవ్ర గర్భస్రావం అవుతోందని, చికిత్సలు అందించలేమని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. దీనితో బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడే 14 రోజుల నుంచి చికిత్సలందిస్తున్నారు. చికిత్సలు ఫలించకపోవడంతో తీవ్రగర్భ స్రావంతో ఆ బాలిక గురువారం మధ్యాహ్నం మృతిచెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విదేశీ ఉద్యోగం పేరుతో
రూ.1.14 కోట్ల మోసం

● ఒకరి అరెస్టు

అడయార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగం పేరుతో రూ.1.14 కోట్ల మేరకు మోసం చేసిన కేసులో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఆయన భార్య, తల్లి కోసం గాలిస్తున్నారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, స్థానిక పొళిచ్చలూరు ప్రాంతానికి చెందిన కృపాకరన్ (37) అనే వ్యక్తికి భార్య సెందూర్ దేవి, తల్లి ధనకొడి దేవి ఉన్నారు. వీరంతా కలిసి విదేశీ ఉపాధి కల్పనా ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. వీరు నాగపట్టణంకు చెందిన మొత్తం 9 మంది వద్ద పోలాండ్ దేశంలో ఉద్యోగం పేరుతో రూ.47.60 లక్షల నగదును వసూలు చేశారు. అయితే వీరిని పోలాండ్‌కు పంపించకుండా ఆర్మేనియా దేశానికి పంపించారు. అక్కడ అష్టకష్టాలు పడిన ఈ తొమ్మిది మంది స్వదేశానికి చేరుకుని, తమను మోసం చేసిన కృపాకరన్ కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కృపాకరన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అనేక మంది వద్ద రూ.1.44 కోట్లు వసూలు చేసినట్టు తేలింది. దీంతో ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. పరారీలో ఉన్న ఆయన భార్య, తల్లి కోసం గాలిస్తున్నారు.

హిజ్రా దారుణ హత్య

అడయార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): లింగ మార్పిడి చేయించుకున్న హిజ్రాను గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్డుతో కొట్టి హత్య చేశారు. ఈ దారుణం సేలం జిల్లాలో జరిగింది. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలను పరిశీలిస్తే, ఈ జిల్లాకు చెందిన మనోహరన్ కుమారుడు శరవణన్ (21) కొన్ని రోజుల క్రితం లింగ మార్పిడి చేయించుకుని హిజ్రాగా మారి వనితగా తన పేరును మార్చుకుంది. ఆ తర్వాత సేలం రైల్వే గేట్ వద్ద ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో నామక్కల్ జిల్లా తిరుచెంగోడుకు చెందిన నవీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి నవీన్‌తో హిజ్రా వెళుతుండటాన్ని కొందరు చూశారు. ఇదిలావుంటే, రాత్రి 11 గంటల సమయంలో వనిత ఇంటికి ఆమె సోదరి మరకదం వెళ్లగా, వనిత దారుణ హత్యకు గురై ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హత్యా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఎన్‌ఎల్‌సీ ఛైర్మన్‌కు
'సీఈవో ఆఫ్ ది ఇయర్' అవార్డు



ప్రసన్నకుమార్ మోటుపల్లి

అడయార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఛైర్మన్ ప్రసన్న కుమార్ మోటుపల్లికి ప్రతిష్ఠాత్మక 'సీఈవో ఆఫ్ ది ఇయర్' అవార్డు వరించింది. ఈ నెల 23, 24వ తేదీల్లో న్యూఢిల్లీలో 'డ్రైవింగ్ ఆర్గనైజేషనల్ సక్సెస్ - ది పవర్ ఆఫ్ లీడర్‌షిప్ టెక్నాలజీ అండ్ పీపుల్' అనే థీమ్‌తో టాప్ ర్యాంకర్స్ మేనేజ్‌మెంట్ క్లబ్ నిర్వహించిన 25వ జాతీయ మేనేజ్‌మెంట్ సమ్మిట్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టాప్ ర్యాంకర్స్ మేనేజ్‌మెంట్ క్లబ్ ప్రెసిడెంట్ వీఎస్‌కే సూద్, ఎన్‌ఎల్‌సీఐఎల్ సీనియర్ అధికారులు పాల్గొని ఎన్ఎల్‌సీ ఛైర్మన్ తరఫున అవార్డును స్వీకరించారు. ఆదర్శప్రాయమైన నాయకత్వం, వ్యూహాత్మక దూరదృష్టి, ఎన్‌ఎల్‌సీ పనితీరు, విలువైన వాటాదారులపై ఆయన చూపిన గణనీయమైన సానుకూల ప్రభావం ఇత్యాది అంశాలన్నింటినీ అవార్డు ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే, వ్యాపార వృద్ధి, కార్యాచరణ నైపుణ్యం, స్థిరమైన పద్ధతులు, నిరంతర దృష్టి కారణంగా ఇంధన రంగంలో ప్రసన్న కుమార్‌ను ఒక ప్రముఖుడిగా నిలిపాయి.

పట్టాభిరాంలో నకిలీ ఆస్పత్రికి సీలు

అడయార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పట్టాభిరాంలో నకిలీ ఆస్పత్రికి పోలీసులు సీలు వేశారు. పోలీసుల కథనం మేరకు.. జ్ఞానంబాల్ (47) అనే మహిళ తన ఇంటిలోనే అలోపతి వైద్యశాలను నడుపుతున్నారు. అయితే, అదే ప్రాంతానికి చెందిన వెంకటేష్ (43) అనే వ్యక్తి భుజంనొప్పి కోసం ఆమె వద్దకు రాగా, ఒక ఇంజెక్షన్ వేసింది. ఇంటికి వెళ్లిన వెంకటేష్‌కు ఇంజెక్షన్ వేసిన భాగంలో వాపు రావడంతో పాటు తీవ్రమైన దురద వచ్చింది. దీంతో ఆయన సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. ఇంజెక్షన్ వికటించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యులు చెప్పారు. దీంతో వెంకటేష్ స్థానిక పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు జ్ఞానంబాల్ ఇంటికి వెళ్లి అలోపతి వైద్యశాలకు సీలు వేశారు. దీనికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుపుతున్నట్టు విచారణలో వెల్లడైంది. జ్ఞానంబాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.